


కాళేశ్వరం గ్రామ శివారులో మునిగిన పత్తి పంట



కమలాపురం ఇన్‌టెక్ వెల్ వద్ద గోదావరి ప్రవాహం

● గోదావరి ఉగ్రరూపం



సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద నీళ్లు

ఉప్పొంగిన ప్రవాహం

- రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద సైతం..
- కమలాపురం ఇంటెక్‌వెల్ వద్ద పెరిగిన నీటి మట్టం
- సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

ఏటూరునాగారం రూరల్/ మంగపేట/వాజేడు/ కన్నాయిగూడెం/వెంకటాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గాను ప్రాణహిత, ఇంద్రావతి, మానేరు నదుల నుంచి వస్తున్న వరదతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద, కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల అధికారులు సైతం అప్రమత్త మయ్యారు. ములుగు జిల్లాలో గోదావరి నది ఉరలేస్తోంది. శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు భారీ వరద నీటి విడుదల చేస్తుండడంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కరఘాట్ వద్ద గోదావరి ప్రవాహం శుక్రవారం ఉదయం 14.830 మీటర్లను దాటి కొనసాగుతుండడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సాయంత్రానికి గోదావరి ప్రవాహం 15.600 మీటర్లకు చేరి ప్రవహిస్తోంది. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజ్‌కు వరద ఉధృతి కొనసాగుతుంది. బ్యారేజ్ వద్ద మొత్తం 59 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లోంచి 8,45,290 క్యూసెక్కుల నీరు బ్యారేజ్‌లోకి ఇన్‌ఫ్లో రాగా బ్యారేజీలో 59 గేట్లు ఎత్తి 8,45,043 క్యూసెక్కుల నీటిని దిగువను నీటిని విడుదల చేశారు. మంగపేట మండలం కమలాపురం ఇన్‌టెక్‌వెల్ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇన్‌టెక్‌వెల్ వద్ద గోదావరి సముద్ర మట్టానికి 84.5 ఫీట్ల ప్రవాహం కొనసాగుతుంది ఇదిలా ఉండగా జే చొక్కారావు దేవాదుల ఎత్తి పోతల ప్రాజెక్టు నుంచి ఫేజ్ 2 నుంచి ఒక మోటారు ద్వారా జయశంకర్ భూపాలపల్లి జిల్లా భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు 247 క్యూ సెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లోంచి వస్తున్న భారీ వరదకు గోదావరి మరింతా అవకాశం ఉంది. గోదావరి ఉధృతి కారణంగా కమలాపురం, బోరునర్సాపురం వద్ద పంటపొలాలు నీటి మునిగాయి. వాజేడు మండలం పేరూరు వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి పెరుగుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. ముంపు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లోంచి భారీగా వరద నీరు గోదావరిలోకి చేరుతుండడంతో గోదావరి పెరిగే అవకాశముందని జిల్లా కలెక్టర్ టి.ఎస్ దివాకర తెలిపారు. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు గోదావరిలోకి చేపల వేతకు వెళ్లొద్దని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 1800425710924 గంటల పాటు అందుబాటులో ఉంటుందన్నారు.



పూసూరు- ముల్లకట్ట వంతెన వద్ద గోదావరి ప్రవాహం



కాళేశ్వరంలో గోదావరి

కాళేశ్వరం వద్ద మొదటి హెచ్చరిక జారీ

మహదేవపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది.. తెలంగాణతో పాటు మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు గాను గోదావరి, ప్రాణహిత నదులు పరవళ్ల తొక్కుతుండ డంతో త్రివేణి సంగమం వద్ద గోదారవి ఉగ్రరూపం దాల్చింది. కాళేశ్వరంలో జ్ఞాన సరస్వతి, సాధారణ పుష్కర ఘాట్ల మెట్లపై నుంచి వరద ప్రవహిస్తోంది. పుష్కర ఘాట్లపై గోదావరి, ప్రాణహిత నదులు పరవళ్ల తొక్కుతున్నాయి. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 12,350 మీటర్ల మేర నీటి మట్టం నమోదైంది. ఈ నేపథ్యంలో గోదావరి పరివాహక సమీప గ్రామాల్లో పంటలు నీట మునిగాయి.

మేడిగడ్డ బ్యారేజీకి 9.89 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 9.89లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా బ్యారేజీ వద్ద నీటి మట్టం 97.30మీటర్లు ఎత్తులో ప్రవహిస్తుంది.

మళ్లీ నిలిచిన అంతర్‌రాష్ట్ర రాకపోకలు

వాజేడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద నీటి ప్రవాహం పెరగడంతో ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగుడెం వద్ద ఉన్న రేకుమాగు వాగుకు వరద నీటి ప్రవాహం పెరిగి జాతీయ రహదారిని ముంచెత్తింది. దీంతో తెలంగాణ-చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నెలలో ఇది రెండోసారి కాగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి గోదావరి వరద అకస్మాత్తుగా పెరగడంతో పోలీసులు, పంచాయతీ అధికారులు బారీకేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిషేదించారు. ఎవరూ రోడ్డు దాటకుండా సిబ్బందిని నియమించారు. గోదావరి వరద తగ్గే వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఒక ప్రకటన తెలిపారు. ఇదే క్రమంలో మండలంలోని పలు అంతర్గత రహదారులను సైతం వరదనీరు కమ్మేసింది. ముఖ్యంగా వాజేడు-గుమ్మడిదొడ్డి, పేరూరు-చంద్రుపట్ల, ఎడ్జర్లపల్లి-బొమ్మనపల్లి, కోయవీరాపురం గ్రామాలకు వెళ్లే రహదారులను వరద నీరు ముంచెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు మునగటంతో వరద బాధితులను పునరవాస కేంద్రాలకు తరలించేందుకు అధికారుల తగిన ఏర్పాట్లను చేశారు. ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, వాజేడు, పేరూరు ఎస్సైలు సతీష్, కృష్ణప్రసాద్‌లు వరద ఉధృతిని నిత్యం సమీక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



పేరూరు-చంద్రుపట్ల రహదారిని ముంచెత్తిన వరద నీరు

లోతట్టు గ్రామాల ప్రజలు

అప్రమత్తంగా ఉండాలి

- ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి వరద ఉధృతి పెరుగుతున్నదని, జిల్లాలోని లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్.దివాకర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి పరివాహక మండలాలైన వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఉధృతంగా పారుతున్న గోదావరి కారణంగా ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడం జరిగిందని అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు గోదావరి ఉధృతి పెరిగే అవకాశం ఉండడంతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీచేసే అవకాశం ఉందని అన్నారు. ఐదు మండలాల్లోని ప్రజలు పశువులను మేతకు తీసుకుపోవద్దని, చేపల వేటకు వెళ్లవద్దని, ప్రవహిస్తున్న నీటిలో ఈత కొట్ట వద్దని సూచించారు. వరదల దృష్ట్యా తక్షణ సహాయం కోసం కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 18004257109 ఏర్పాటుచేయడం జరిగిందని, సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధితశాఖ అధికారును తక్షణ పరిష్కారం నిమిత్తం పంపడం జరుగుతుందని అన్నారు.

‘బండి’ జోరుకు బ్రేకులు

- అక్రమాస్తుల కేసులో ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వరరావు అరెస్టు
- ఏకకాలంలో మూడు చోట్ల ఏసీబీ అధికారుల సోదాలు
- చైతన్యపురిలోని నివాసంలో బంగారం, డాక్యుమెంట్ల స్వాధీనం
- గుర్తించిన ఆస్తులు విలువ రూ.5 కోట్లపైనే...
- వీటి మార్కెట్ విలువ అనేక రెట్లు అధికం
- నాగేశ్వరరావుపై కొన్నాళ్లుగా అవినీతి ఆరోపణలు



నాగేశ్వర్‌రావు

చైతన్యపురిలోని నాగేశ్వర్‌రావు నివాసం, ఏసీబీ అధికారులు గుర్తించిన అక్రమ ఆస్తులు



వరంగల్ క్రైం/ఖిలా వరంగల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారి అక్రమాస్తుల డొంక కదిలింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకున్న బండారం బయటపడింది. వరంగల్ జిల్లా పరిధిలోని ఖిలా వరంగల్ మండల తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావును అక్రమాస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేయడం కలకలం రేపింది. ఆయన ఇంటిపై శుక్రవారం జరిగిన ఏసీబీ దాడులు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రెవెన్యూశాఖలో కలకలం రేపాయి.

నాగేశ్వర్‌రావు గతంలో హసన్‌పర్తి, కాజీపేటలో పనిచేశారు. ప్రస్తుతం ఖిలా వరంగల్‌లో పనిచేస్తున్నారు. కొన్నాళ్లుగా ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ సంబంధిత పనులు చేయడంలో పెద్ద మొత్తంలో డబ్బులు కూడబెట్టుకున్నట్టు ఫిర్యాదులున్నాయి. అలాగే తన సొంత జిల్లా అయిన ఖమ్మంలో బినామీ పేర్లపై రియల్ (మిగతా 8వ పేజీలో)



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం అభివృద్ధే లక్ష్యం

- జాతర అభివృద్ధి పనులకు రూ.150 కోట్ల నిధులు
- పూజారులు, పలు శాఖ అధికారులతో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క
- వనదేవతలకు ప్రత్యేక పూజలు
- మారనున్న వనదేవతల గద్దెల రూపు

తాడ్వాయి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం వన దేవతల గద్దెల రూపు మారనున్నట్లు, మేడారం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షమ శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. మేడారం ఐటీడీఏ అతిథి గృహంలోని సమావేశం మందిరంలో శుక్రవారం మంత్రి సీతక్క జిల్లా అధికారులు, పూజారులు, ఆర్కియాలజిస్ట్ రాజశేఖర్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లా డుతూ మేడారం శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసిందన్నారు. వందల సంవత్సరాలు నిలిచేలా తల్లుల గద్దెలను అభివృద్ధి చేస్తామన్నా రు. రాబోయే ముందు తరాలకు సమ్మక్క సారలమ్మల చరిత్రలు తెలిసేలా ఈ రూపకల్పన ఉం టుందన్నారు. ఈ క్రమంలో 2026 మహాజాతర అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. జాతర లోపు మొదటి విడుత పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గద్దెల ప్రాంగణం విస్తరణ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల స్థల మార్పులు, చేర్పులు, క్యూలైన్ల విస్తరణ, నూతన మీడియా పాయింట్ భవనం, ముఖ్యమంత్రి అతిథి భవనం, పూజారుల వసతి భవనం, క్లౌడ్ లైటింగ్, వీవీఐపీ టవర్స్, ఇతర అతిథి భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు త్వరితగతిన టెండర్లు పూర్తి చేయాలని అన్నారు. తల్లుల గద్దెలను సులభంగా శుభ్రం చేసేలా, వర్షపునీరు వచ్చిన వరద నీరు గద్దెలకు చేరకుండా ప్రాకారం బయటి నుంచి వెళ్లేలా డ్రెయినేజీలు నిర్మిస్తామన్నారు. భక్తులకు సులువైన దర్శ నం కలిగే విదంగా గద్దెలను వరుస క్రమంలో ఏర్పాటు చేయనున్నామన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదా యాలు తెలియని కొందరు ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ వనదేవతల అభివృద్ధిని హేళన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందల ఏళ్ల నిలిచేలా గిరిజన దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. మేడారం అభివృద్ధికి రూ.150 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సహకరించిన మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆర్కియాలజిస్ట్ రాజశేఖర్ నూతన డిజైన్లను మంత్రితో పాటుగా పూజారులు, పలు శాఖల అధికారులకు స్లైడ్ షో ద్వారా వివరించారు. తెలంగాణ ట్రైబల్ డిజైన్స్ ప్లాన్స్‌తో ఈ రూపకల్పన చేయడం జరిగిందన్నారు. అనంతరం మంత్రి అధికారులతో కలిసి వనదేవత లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ రవిచందర్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి, డీఎస్పీ రవీందర్, మేడారం దేవస్థాన కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, పూజారులు, అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా రూపొందించిన గద్దెల డిజైన్

సన్నబియ్యం.. చేతి సంచి..

● సెప్టెంబర్ 1 నుంచి కొత్త ‘రేషన్’ ● నూతన లబ్ధిదారులకు అందనున్న బియ్యం

ములుగు టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త రేషన్ కార్డు పొందిన పేదలకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి రేషన్‌బియ్యం అందనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం రేషన్ కోటా విడుదల చేసింది. జూన్ నెలలో ఒకేసారి మూడు నెలల బియ్యం కోటాను లబ్ధిదారులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. మళ్లీ తిరిగి సెప్టెంబర్ నుంచి నెలవారి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ క్రమంలో సెప్టెంబర్ నెల కోటా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 10 మండలాలకు ములుగు మండలంలో 35, వెంకటాపూర్ 20, గోవిందరావుపేట 32, తాడ్వాయి 23, ఏటూరునాగారం 27, కన్నాయిగూడెం 13, మంగపేట 44, వాజేడు 12, వెంకటాపురం 16 మొత్తంగా 222 రేషన్ దుకాణాల ద్వారా 2,86, 589 జనాభాకు ఆహార భద్రత పథకం కింద సన్న బియ్యం అందనున్నాయి. ఇందులో 8,966 కొత్త రేషన్ కార్డులు కాగా 28,608 మందికి సన్న బియ్యం అందించనున్నారు. తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచితంగా రేషన్‌తో పాటు చేతి సంచిని ప్రభుత్వం అందజేయనుంది. సంచిపై ‘అందరికీ సన్న బియ్యం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం’ అనే నినాదం ముద్రించారు. రూ 50 విలువ చేసే ఈ బ్యాగును ఉచితంగానే సన్న బియ్యంతో పాటు అందజేయనున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం కోసం పర్యావరణ రహితంగా తయారుచేసిన ఈ బ్యాగును లబ్ధిదారులకు అందజేయనున్నారు.



రేషన్‌కార్డు లబ్ధిదారులకు అందించనున్న చేతి సంచి

అత్తింటి ఎదుట ఆమరణ నిరాహార దీక్ష

● వెంటనే విరమింపజేసిన పోలీసులు



అత్తింటి ఎదుట దీక్షకు కూర్చున్న వసంత

కేసముద్రం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోంచి వెళ్లిపోవాలని అత్తగారు ఆదేశించడంతో, నిరసనగా అత్తింటి ఎదుటే ఓ మహిళ, తన ఇద్దరు కూతుళ్లతో కలిసి శుక్రవారం ఆమరణ నిరాహారదీక్షకు దిగింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన ప్రకారం.. కేసముద్రం విలేజి చైతన్యనగర్ కాలనీకి చెందిన చెడుపాక వసంతకు ఇదే కాలనీకి చెందిన వ్యక్తితో వివాహం జరగగా వీరికి నలుగురుకూతుళ్ల సంతానం. వసంత భర్త కుటుంబాన్ని పట్టించుకోకుండా రెండు వారాలుగా ఇంటికి రాకుండా ఉండడంతో అత్తింటివారు ఆమెను కూడా వెళ్లిపోవాలని ఆదేశించారు. దీంతో వసంత తన ఇద్దరు కూతుళ్లు ఇనుగుర్తి హాస్టల్‌లో చదువుతుండగా మిగిలిన ఇద్దరితో కలిసి అత్తింటి ఎదుటే ఆమరణ నిరాహారదీక్షకు దిగింది. కొద్దిని మిషాల్లోనే విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఆమెను సముదాయించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అత్తామామలను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి వసంతను ఇంటింటికి పంపినట్లు ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు?

బయ్యారం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అక్రమ రవాణా చేస్తూ, సేవిస్తున్న పలువురు నిందితులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం. కొంత కాలంగా సూర్యాపేట తదితర గ్రామాల నుంచి గంజాయి తీసుకొచ్చి బయ్యారం మండలంలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీంతో మండలానికి చెందిన పలువురు గంజాయి సేవిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు ఆ దిశగా నిఘా పెట్టినట్లు సమాచారం. అందులో భాగంగా ప్రత్యేక బృందాలుగా ఏర్పాటైన పోలీసులు గంజాయి ఎక్కడి నుంచి వస్తుంది..? ఎవరు తీసుకొస్తున్నారు..? ఎవరికి విక్రయిస్తున్నారు..? ఎవరెవరు సేవిస్తున్నారనే కోణంలో కొద్ది రోజులుగా దర్యాప్తు సాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే పలువురు గంజాయి నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు మరింత లోతుగా విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా.. పోలీసుల అదుపులో గంజాయి నిందితులు ఎవరు లేరన్నారు. కాగా, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాలను సారం గంజాయి ఆనవాళ్లను నియంత్రించేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది.

పనుల జాతరతో పల్లెల అభివృద్ధి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పనుల జాతరలో భాగంగా శుక్రవారం పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. ములుగు మండలం జగ్గన్నపేటలో 35 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, నూతనంగా 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం భూమి పూజ చేశారు. అనంతరం ఇంచర్లలో 20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవి చందర్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు నూనేటి శ్యామ్ యాదవ్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న మంత్రి

వెంకటాపూర్: అన్నదాన కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండల కేంద్రంలో శ్రీరాముల యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద మంత్రి సీతక్క పీఆర్వో బొమ్మకంటి రమేష్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆమె హాజరై భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, మండల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోవిందరావుపేట: మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని చల్వాయిలో రూ.45లక్షలతో అంతర్గత సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా దుంపెల్లిగూడెంలో రూ.10లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. పస్రాలో రూ.55లక్షల నిధులతో నిర్మించిన అంతర్గత సీసీరోడ్లు, డ్రెయినేజీ, పాత బొడ్రాయి నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు రూ.20లక్షలతో నిర్మించిన సీసీరోడ్ల పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, తదితరులు పాల్గొన్నారు.



జగ్గన్నపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీతక్క

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

● స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
● మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, కేసీఆర్ ఎస్ పాలనను గుర్తు చేస్తూ ఇంటింటికి వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దవంగరలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి అన్ని స్థానాలల్లో బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయాలు తప్ప రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిలేదని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రతీ రైతను ఆదుకున్నామని, సబ్బండ వర్గాలకు అండగా నిలి చామని తెలిపారు. కాంగ్రెస్ రాగానే కరువు, యూరియా కష్టాలు మళ్లీ మొదలైనట్లు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టర్ ఫ్లాప్ అయిందని, ఏడాదిన్నర పాలనలో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని ధ్వజ మెత్తారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ తగిన గుణంపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. లోకల్ ఎన్నికల్లో సత్తాచాటాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ వి.రామచం ద్రయ్య, పాకనాటి సునీల్‌రెడ్డి, శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, సోమ నర్సింహారెడ్డి, వెంకన్న, బాస్కర్, కుమారస్వామి, దుంపల సమ్మయ్య, వెంకట్రామయ్య, శ్రీనివాస్, ముజీవుద్దీన్, షర్ఫుద్దీన్, రఘు, రాము, భీమా, బిక్షపతి, అనిల్, ప్రదీప్, అనుదీప్ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

కాటారం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని దేవరాంపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును, పారిశుధ్య నిర్వహణను పరిశీలిం చారు. నాణ్యమైన భోజనం, విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఏఐ టెక్నాలజీతో నడుస్తున్న కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో చెత్త, చెదారం లేకుండా చేయాలని, మురికినీరు నిల్వ ఉండకుండా చర్య తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మణ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఏడబ్ల్యూటీ కమలాదేవి, ప్రజలు తదితరులు ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి తీవ్ర అస్వస్థత



విద్యార్థినికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

వాజేడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కేజీబీవీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న జీరి రమ్యారెడ్డి అనే విద్యార్థిని కేజీబీవీ పాఠశాలలో ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురై కిందపడిపోవడంతో సిబ్బంది హుటాహుటిన అందుబాటులో ఉన్న ద్విచక్ర వాహనంపై వాజేడు వైద్యశాలకు తరలించారు. విద్యార్థిని పరీక్షించిన మాతాశిశు సంరక్షణ వైద్యాధికారి డాక్టరు యోషిత ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం ఏటూరునాగారం వైద్యశాలకు రిఫర్ చేయగా అక్కడ చికిత్సను నిర్వహిస్తున్నారు.

మరో యాదాద్రిలా కోటంచ ఆలయం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మరో యాదాద్రిలా అభివృద్ధి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని కోటంచ, రంగయ్యపల్లి గ్రామాలలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ కోటంచ గ్రామంలో రూ 20లక్షల నిధులతో గ్రామ పంచాయితీ భవనం, రంగయ్యపల్లి గ్రామంలో మడేలయ్య గుడికి రూ 5లక్షల నిధులు, రేణుక ఎల్లమ్మ గుడి ప్రహరీని రూ 15లక్షల నిధులతో నిర్మిస్తున్నామన్నారు.

ఈ కార్య క్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎన్ఎస్ఆర్ సంపత్‌రావు, కోటంచ ఆలయ ఈవో మహేష్, చైర్మన్ భిక్షపతి, తహసీల్దార్ శ్వేత, నాయకులు నర్సన్న, ఉమేష్‌గౌడ్, పుల్లూరి బాబూరావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, పున్నం రవి, రవిందర్‌రావు, మైస భిక్షపతి, పట్టెం శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కొటంచలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మాదకద్రవ్యాల వినియోగం నేరం

యాంటీ నార్కోటిక్ డీఎస్పీ రమేష్ కుమార్

ఏటూరునాగారం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మత్తు ఏ రూపంలో ఉన్నా నేరమేనని, మాదకద్రవ్యాలు వాడటం నేరమని యాంటీ నార్కోటిక్ డీఎస్పీ రమేష్‌కుమార్ అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కళాశాల యాంటీ డ్రగ్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి యాంటీ నార్కోటిక్ డీఎస్పీ రమేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రేణుక, యాంటీ డ్రగ్ సెల్ బాధ్యులు సిహెచ్. వెంకటయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. నవీన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జ్యోతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ కనీస్ ఫాతిమా, సంపత్, రమేష్, జీవవేణి, శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని భూపా లపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కృష్ణకాలనీలోని అంబేద్కర్ స్టేడియంలో మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కవీంద్ర, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, సీఎంఓఏ అధ్యక్షుడు నజీర్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు మధూకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణను స్పెషల్ డ్రైవ్‌గా తీసుకోవాలి

● పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
● మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణను స్పెషల్‌డ్రైవ్‌గా తీసుకుని, ప్రతీ వార్డులో క్రమం తప్పకుండా పనులు నిర్వహించాలని స్థానిక శాసనసభ్యుడు భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 24వ వార్డు పరిధిలో శ్రీరాంభద్రన్న కాలనీ, లెనిన్‌నగర్, ఇందిరానగర్‌లో రూ.14.96 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణాలకు శుక్రవారం ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ రవీందర్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తూ మానుకోటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. వర్షాకాలంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకుంటే ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదముందని అందుకోసం సైడ్ కాల్వలను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూడాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు

పట్టణాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దుతాం

మానుకోట పట్టణాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దుకుందామని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మునిసిపాలిటీ పరిధిలో అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయని వాటికి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. పారిశుధ్య విషయంలో ప్రధాన రహదారులపైనే దృష్టి పెడుతున్నారని, కాలనీలు, వీధుల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందన్నారు. అధికారులు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రాజకీయాలకతీతంగా పట్టణాభివృద్ధి కోసం అంతా కలిసికట్టుగా పని చేద్దామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్, మాజీ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంక న్న, చిట్యాల జనార్దన్, మార్నేని రఘు, జేరిపోతుల వెంకన్న, షేక్. మహబూబ్‌పాష, మంగలంపల్లి కన్న, పోతురాజు రాజు, పద్మం ప్రవీణ్, రవి నాయక్, సల్వాది దిలీప్, కొత్త ఇంద్రారెడ్డి, మాదరబోయిన యాకయ్య, మార్నేని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష

గోవిందరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష పడినట్లు పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన గోదా తిరుపతి 2022లో మైనర్ బాలికను ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో సదరు బాలిక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కరుణాకర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

దీంతో జిల్లా జడ్జి ఎస్వీపీ.సూర్యచంద్రకళ శుక్ర వారం కేసు విచారణ చేపట్టగా పీపీ సీహెచ్. సత్యనారాయణ సాక్షులను హాజరుపరచగా నిజం నిర్ధారణ కావడంతో జడ్జి నిందితుడికి పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.14వేల జరిమానా విధిస్తూ బాధితురాలికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలని తుదితీర్పు వెల్లడించారు. సాక్షులను సరైన సమయంలో కోర్టులో ప్రవేశ పెట్టిన ఎస్సై కమలాకర్, కోర్టు కానిస్టేబుళ్లు గిరివాసు, మౌనికలను జిల్లా ఎస్పీ శబరీష్ అభినందించారు.

యువతి మృతదేహానికి పోస్టుమార్టం

● ఆధారాలు సేకరించిన క్లూస్ టీం ● వివిధ కోణాల్లో పోలీసుల విచారణ



మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తున్న పోలీసులు

కాటారం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 353(సీ)జాతీయ రహదారి పక్కన కమలాపూర్ క్రాస్ సమీపంలోని మేడిపల్లి అడవిలో అనుమానస్పద స్థితిలో లభ్యమైన మృతదేహం చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కప్పల వర్షిణి(22)అనే యువతిదిగా గుర్తించిన పోలీసులు మృత దేహానికి శుక్రవారం సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై శ్రీనివాస్ భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రి ఫోరెన్సిక్ ప్రొఫెసర్, వైద్యసిబ్బంది ద్వారా పోస్టుమార్టం చేయించారు. కాగా వర్షిణిది హత్యగానే తేల్చిన పోలీసులు ఆధారాల సేకరణలో నిమగ్నమయ్యారు. క్లూస్ టీం ఇంచార్జి, సీఐ ఉపేందర్ నేతృత్వంలో టీం క్లూస్ సేకరించింది. భూపాలపల్లి జిల్లా కేంద్రానికి 5కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి పక్కన 50మీటర్ల దూరంలో కుళ్లిన స్థితిలో మృతదేహం ఉండటంతో పోలీసులు అక్కడే పోస్టుమార్టం నిర్వహింపజేసి ఒడితలకు తరలించగా అక్కడ మృతురాలి తల్లి కవిత, బంధువులు ఖననం చేశారు. వర్షిణి హత్యపై కుటుంబసభ్యులతో పాటు గ్రామంలోని కొందరిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడానికి పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఏదైనా ప్రేమ వ్యవహారమా.. కుటుంబసభ్యులతో గొడవనా.. అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7650	5300
మక్కలు	2216	1521
కందులు	5622	3022
పెసళ్లు	5550	3022
పల్లికాయ (సూక)	6300	3500
పల్లికాయ (పచ్చిది)	4760	2400
పసుపు (కాడి)	11555	7889
పసుపు (గోల)	10609	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	15000	12000
వండర్‌హాట్ ఏసీ	-	-
యూఎస్341ఏసీ	15000	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

'మెట్రో రైలు' పట్టాలెక్కేనా..?!

- 2019లో మెట్రో రైలుకు రూ.1,341 కోట్ల అంచనాలతో డీపీఆర్
- కేంద్రంపై ఒత్తిడి లేక నగరవాసులకు కలగానే మెట్రో ప్రయాణం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాష్ట్రంలో అతిపెద్ద రెండో నగరంగా ఉన్న వరంగల్ ఇటీవల కాలంలో భారీగా విస్తరిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభా 8,30,281 మంది. ప్రస్తుత 2025 లెక్కల ప్రకారం 11,24,336 జనాభా ఉండగా, 2040 వరకు 15,66,982 జనాభా పెరుగుతుందని అంచనా వేశారు. అలాగే 2055 వరకు 21,31,762 జనాభా పెరుగుతుందని అధికారుల అంచనా. ఇప్పటికే 2వేలకు పైగా కాలనీలు ఏర్పడ్డాయి. వరంగల్ బస్టాండ్ నుంచి పోచమ్మమైదాన్ వరకు, ములుగు రోడ్డు నుంచి పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వరకు, అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు, ఫాతిమానగర్ నుంచి కాజీపేట వరకు భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇవే రూట్లు కాకుండా, ధర్మారం నుంచి కాశిబుగ్గ మీదుగా పోచమ్మమైదాన్ వరకు, కాకతీయ యూనివర్సిటీ నుంచి పెద్దమ్మగడ్డ మీదుగా ములుగు రోడ్డు వరకు కూడా ట్రాఫిక్ కష్టాలు పెరిగాయి. హంటర్ రోడ్డు నుంచి ఖమ్మం వెళ్లే దారిలో కూడా ట్రాఫిక్ కష్టాలు తప్పటం లేదు.

మామునూరులో విమానాశ్రయం వస్తుండటంతో ఈ ప్రాంతంలో నూతన కాలనీలు పెరుగుతున్నాయి. కొత్తగా గీసుకొండ, సంగెం మండలాల మధ్య కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు రావటంతో ఇక్కడ సుమారు 2లక్షల మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. దీంతో ఈ ప్రాంతం మొత్తం నగరంతో అనుసంధానం కానుంది. ఇలా నగరం విస్తరిస్తుండటంతో రాకపోకలపై ప్రభావం పడుతోంది. గతంలో వందకు పైగా లోకల్ బస్సులు నగరంలో చక్కర్లు కొట్టేవి. ప్రస్తుతం లోకల్ బస్సుల సంఖ్య భారీగా తగ్గటంతో ప్రయాణికులు ఆటోలు, ఇతర ప్రవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వాహనాల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. వ్యయంతో కూడా ప్రయాణం కావటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో కూడా మెట్రోరైలు సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే డిమాండ్ బలంగా తెరపైకి వస్తోంది.



అటకెక్కిన ప్రతిపాదనలు

నగరం విస్తరిస్తుండంతో హైదరాబాద్ తరహాలో మెట్రో రైల్ ఏర్పాటుపై గత ప్రభుత్వం సర్వే నిర్వహించింది. 2019 డిసెంబరు 24వ తేదీన అధికారులు కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు 15.5కిలో మీటర్ల వరకు మెట్రో రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వరంగల్ మెట్రో నియో ప్రాజెక్టుగా నామకరణం కూడా చేశారు. 'కుడా' నిర్వహణలో ఈ రైల్‌ను నిర్వహించాలని అప్పట్లో నిర్ణయించారు. లైట్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎల్ఆర్‌టీఎస్) ద్వారా ఒకే దశలో ప్రాజెక్టు పూర్తి చేయాలని డీపీఆర్ రూపొందించారు. 2025లో ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.1,341కోట్ల అంచనా వ్యయంతో వరంగల్ మెట్రో రైల్‌కు రూపకల్పన చేశారు. కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు 15.5కి.మీల దూరంలో 7.1కిలో మీటర్లు రోడ్డు మార్గంలో 8.4కి.మీలు ఆకాశమార్గంలో రైల్వేట్రాక్ నిర్మించాలని నిర్ణయించారు. 2041నాటికి వరంగల్ జనాభా 20లక్షలకు చేరుకుంటుందని అప్పటి అంచనాలతో మహారాష్ట్రలోని నాసిక్ నియో మెట్రో తరహాలో వరంగల్‌లో నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు.

రబ్బరు టైర్లపై నడవటం నియో మెట్రో రైల్ ప్రత్యేకత. విద్యుత్ వ్యయం కూడా భారీగా ఆదా అవుతుందని అంచనావేశారు. కాగా, 21 స్టేషన్లను ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. వీటిలో కాజీపేట రైల్వేస్టేషన్, ఫాతిమానగర్, ఎన్ఐటీ, అటవీశాఖ కార్యాలయం, సుబేదారి, రోహిణి ఆస్పత్రి, అదాలత్, నక్కలగుట్ట, అంబేద్కర్ జంక్షన్, పోలీస్ కమిషనరేట్, ప్రసూతి అస్పత్రి, హనుమకొండ చౌరస్తా, అలంకార్ జంక్షన్, ములుగు రోడ్డు, కేఎంసీ, ఎంజీఎం, పోచమ్మమైదాన్, ఎల్‌బీ నగర్, కాశిబుగ్గ, వెంకట్రామ టాకీస్, వరంగల్ రైల్వేస్టేషన్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు. 2021 మార్చిలో వరంగల్ మెట్రో నియో రైలు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి లేకపోవటంతో వరంగల్ మెట్రోకు గత ఐదారేళ్లుగా బ్రేక్ పడిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

మెట్రో రూట్ మార్చాల్సిందే..?

వరంగల్ నగరానికి మెట్రో రైల్ కోసం ఓరుగల్లు ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు. 2019 నాటి ప్రతిపాదనను మార్చి కొత్త రూట్లతో ప్రతిపాదనలు చేయాలని కోరుతున్నారు. కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి కాకుండా రాంపూర్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా మామునూరు ఎయిర్‌పోర్టు వరకు కొత్త రూట్‌ను ప్రతిపాదన చేయాలని కోరుతున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్కు వరకు లైన్‌ను పొడిగించేలా ప్రణాళిక రూపొందిస్తే.. భవిష్యత్తులో మెట్రో విస్తరణకు ఉపయోగపడుతుందనే చర్చ నడుస్తోంది.

అభివృద్ధికి అనుసంధానం

మెట్రో రైల్ వస్తే వరంగల్ నగరానికి కొత్త కళ వస్తుందనే వ్యాఖ్యలు ఉన్నాయి. హైదరాబాద్ తరువాత అత్యంత వేగంగా వరంగల్ నగరం అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే సిద్ధంగా ఉన్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కును పీఎం శ్రీ మిత్ర పథకంలో చేర్చింది. దీంతో భవిష్యత్తులో భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండటంతో సుమారు రెండు లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల రానున్నాయి. దీంతో ఈ ప్రాంతానికి కూడా మెట్రో రైల్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాగే మామునూరు ఎయిర్‌పోర్టుకు చకచకా పనులు జరుగుతున్నాయి. 2027నాటికి ఎయిర్‌పోర్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు మెట్రో సేవలు అవసరం పడతాయనే చర్చ జరుగుతోంది. అలాగే మడికొండలోని ఐటీ పార్కులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు కంపెనీలతో చర్చలు జరుపుతోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వరంగల్ నగరానికి మెట్రో రైల్ అనేది అత్యవసరమనే చర్చ ఉంది.

పర్యావరణ హితం గోమయం గణేశుడు

- 16ఏళ్ల పాటు మట్టి వినాయక విగ్రహం
- గత పదేళ్లుగా గోమయం విగ్రహం
- కాళేశ్వరంతో పాటు సప్త నదుల జలంతో అభిషేకాలు


మహబూబాబాద్‌లో శ్రీమహాలక్ష్మిగణపతి సేవా ట్రస్టు ఏర్పాటు చేసిన గోమయం వినాయక విగ్రహం

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా శ్రీమహాలక్ష్మిగణపతి సేవా ట్రస్టు బాధ్యులు వినాయక చవితి ఉత్సవాల్లో దశాబ్ద కాలంగా గోమయం వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉత్సవాలు ప్రారంభించిన మొదటి సంవత్సరం నుంచి పర్యావరణ పరిరక్షణ కోసం 16 సంవత్సరాల పాటు మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు చేయగా, పదేళ్ల నుంచి గోమయ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఎన్వీ నాగేశ్వర్ రావు, సోమ శ్రీనివాస్, శ్రీరంగం రామారావు, సోమ రాంబాబు 2000వ సంవత్సరంలో శ్రీమహాలక్ష్మీ గణపతి సేవా ట్రస్టును స్థాపించి ఏటా వినాయక నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ట్రస్టు స్థాపించిన నాటి నుంచి మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించిన ట్రస్టు బాధ్యులు 2016లో మరో అడుగు ముందుకు వేసి పదేళ్లుగా పర్యావరణ హితం గోమయం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ వస్తున్నారు.

విగ్రహం తయారీ ఇలా..

చెరువుల్లో నిమజ్జనం చేశాక వెంటనే కరిగిపోయి పర్యావరణానికి హాని కలగకుండా గోమయం విగ్రహాన్ని నెలకొల్పుతున్నారు. గోమయం(ఆవుపేడ), గోపంచకం(మూత్రం), చింతగింజల పౌడర్, వేపాకు పేస్టు, పసుపుతో విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. ఏటా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తయారు చేసిన గోమయం విగ్రహాన్ని ట్రస్టు బాధ్యులు కొనుగోలు చేసి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాల్లో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ గోమయం విగ్రహం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేశాక త్వరితగతిన కరిగిపోవడంతో పాటు ఆవుపేడ, గోపంచకం, వేపాకు పేస్ట్, పసుపు, చింతగింజల పౌడర్‌తో తయారు చేయడంతో నీళ్లలో ఉన్న క్రిమికీటకాలు నశించి పోతాయని చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యానికి హాని కలుగకుండా గోమయం విగ్రహం ఎంతగానో దోహదపడుతుంది. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఏటా వినాయక విగ్రహం వద్ద ఉదయం పూజ వేళలో కాళేశ్వరం నుంచి ప్రత్యేకంగా తీసుకవచ్చిన గంగాజలంతో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ 21రకాల అభిషేకాలు నిర్వహించారు. ఈ సంవత్సరం కాళేశ్వరంతోపాటు ఏడు సప్త నదుల జలాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విగ్రహాన్ని దర్శించుకుంటున్నారు.

బాధితులకు సాయం అందించడంలో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

వేలేరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన బాధితులకు సాయం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. శుక్రవారం వేలేరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు నిండు కుండలా మారాయని, ప్రభుత్వం సరైన సమీక్ష నిర్వహించకపోవడం వల్ల దేవాదుల, కాళేశ్వరం కింద ఉన్న పంట పొలాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆయన విమర్శించారు. ప్రాజెక్టులకు సంబంధించిన మోటార్లను ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ కార్యకర్తలే మోటార్లను ఆన్ చేస్తారని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు హెచ్చరిక చేయడంతో గోదావరి వద్ద మోటార్లను ఆన్ చేశారన్నారు. రైతుల సమస్యలను బలంగా ప్రస్తావించేందుకు రైతుల పక్షాన ఈనెల 31న వేలేరు మండలం నుంచి గండరామారం వరకు పాదయాత్ర చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ పాదయాత్రను మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. యూరియా కోసం రైతులు క్యూలో నిలబడి ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాత్రం యూరియా కొరత లేదని అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని రాజయ్య విమర్శించారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

పారదర్శకత కోసమే
సమాచార హక్కు చట్టం

- ఆర్టీఐ చట్టం కమిషనర్లు అయోధ్యరెడ్డి, శ్రీనివాస్‌రావు


మాట్లాడుతున్న అయోధ్యరెడ్డి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనం కోసమే సమాచార హక్కు చట్టం వచ్చిందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టం 2025పై వివిధ శాఖల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిందని, ఇందులోని అంశాలపై అధికారులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందించిన జిల్లాల్లో వరంగల్ జిల్లా ఒకటని, సంబంధిత అధికారులు ప్రజలకు సకాలంలో పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు.

ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా చూడాలని, గడువు లోపల సమాధానమివ్వాలని ఆదేశించారు. మూడు సంవత్సరాల నుంచి 17వేల ఆర్టీఐ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకే జిల్లాల్లో పర్యటిస్తున్నామని అన్నారు. అన్ని శాఖల అధికారులు 4-1బి, సిటిజన్ చార్టర్‌ను పక్కాగా అమలు చేస్తే సమస్యలు తగ్గుతాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రతీ మూడు నెలలకు ఒకసారి చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

అంతకుముందు కలెక్టరేట్‌కు విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్లకు కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్ పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, డీఆర్వో విజయలక్ష్మి, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద నీటి ప్రవాహ అంచనా పరీక్షలు

- సీడబ్ల్యూపీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏడీసీపీ సర్వే చేసిన నిపుణులు


ఎగువ ప్రవాహంలో ఏడీసీపీ సర్వే నిర్వహిస్తున్న సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణులు

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద శుక్రవారం నీటి ప్రవాహఅంచనాను గుర్తించే ఏడీసీపీ(అకౌస్టిక్ డాప్లర్ కరెంట్‌ప్రొఫైలర్) సర్వే నిర్వహించారు. పూణేకు చెందిన సీడబ్లూపీఆర్ఎస్ (సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్) సైంటిస్టు నాగరాజ్ టీం ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. మేడిగడ్డ బ్యారేజీని సముద్రమట్టానికి 88 మీటర్ల ఎత్తులో నిర్మించగా బ్యారేజీ పూర్తి లెవల్‌లో వరద ప్రవాహం ఉన్నప్పుడు ఆ తీవ్రత ఎలా ఉంటుందో గుర్తించడానికి ఈసర్వే నిర్వహించినట్లు ఇంజనీర్లు తెలిపారు. బ్యారేజీ ఫుల్ రిజర్వాయర్ లెవల్ 100 మీటర్లు కాగా శుక్రవారం 97.30 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుండడంతో ఈ పరీక్షలు చేపట్టినట్లు పేర్కొన్నారు. 88 మీటర్ల నుంచి 100 మీటర్ల ఎత్తులో ప్రవాహం ఉన్నప్పుడు ప్రతి పాయింట్ వద్ద ఈ పరీక్షను నిర్వహించి ఏ పాయింట్ వద్ద ప్రవాహ తీవ్రత ఎలా ఉందో గుర్తించనున్నట్లు తెలిపారు. బ్యారేజీ కుంగిన మొదట్లోనూ ఈ పరీక్షలు నిర్వహించినప్పటికి ఎన్‌డీఎస్ఏ(నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) తుది నివేదిక మేరకు ఈ పరీక్షలు చేపట్టినట్లు చెప్పారు. గత నెల 24న ఒకమారు, ఈనెల 5న మరోమారు బ్యారేజీ వద్ద పరీక్షల నిమిత్తం పరిశీలన చేసిన సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణుల బృందం వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పరీక్షించేందుకు వచ్చినట్లు స్పష్టం చేశారు. వారి వెంట డీఈఈ సురేష్, ఇతర ఇంజనీర్లు ఉన్నారు.

భళా.. ఏఆర్, వీఆర్ ల్యాబ్

- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు వర్చువల్ రియాలిటీ దన్ను
- ఉమ్మడి జిల్లాలో 11 పాఠశాలల్లో ల్యాబ్‌ల ఏర్పాటు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీఎంశ్రీ పథకం ద్వారా ఇప్పటికే అనేక పాఠశాలల్లో మెరుగైన ప్రమాణాలను చేకూరుస్తున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 164 పాఠశాలలను ఎంపిక చేసి వాటిల్లో ఏఆర్ (అగ్మెంటెడ్ రియాలిటీ), వీఆర్ (వర్చువల్ రియాలటీ) ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సైతం 11 పీఎంశ్రీ పాఠశాలలను ఎంపిక చేసి వాటిల్లో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. పాఠశాలల్లో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు సంక్లిష్టమైన విషయాలను సులభంగా అర్థం చేసుకోవడానికి విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లు విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేయడానికి రిమోట్‌గా సహకరించడమే కాకుండా విద్యార్థులు వారి సొంత వేగంతో విషయాలు నేర్చుకోవడానికి ఈ ల్యాబ్‌లు దోహదం చేస్తాయి. ఈ ల్యాబ్‌లు బోధన, పుస్తకాల ద్వారా నేర్చుకోవడానికి బదులుగా విద్యార్థులను వాస్తవిక ప్రపంచంలో అనుభవించేలా చేస్తాయి. ఫిజిక్స్, బయాలజీల్లోని సంక్లిష్ట విషయాలను 3డిలో చూడటం ద్వారా సులభంగా నేర్చుకోవచ్చు. ఖరీదైన, ప్రమాదకరమైన ప్రయోగాలను సురక్షితంగా వర్చువల్ వాతావరణంలో చేయవచ్చు. ఈ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులు వ్యక్తిగత అభ్యసన అనుభవాలను పొందవచ్చు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల్లో కలిపి మొత్తం 11 పీఎంశ్రీ పాఠశాలలను ఎంపిక చేసి ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. వరంగల్ జిల్లా నర్సంపేటలోని బాలికల జడ్పీహెచ్ఎస్‌తో పాటు రాయపర్తి మండలంలోని కొండూరు జడ్పీహెచ్ఎస్‌లో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే హనుమకొండ జిల్లాలో ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి జడ్పీహెచ్ఎస్, కాజీపేట మండలం మడికొండ జడ్పీహెచ్ఎస్‌లో, జనగామ జిల్లాలో జనగామ మండలం దామరంచ జడ్పీహెచ్ఎస్‌లో, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి మండలం గొల్లబుద్దారం జడ్పీహెచ్ఎస్‌లో, ములుగు జిల్లాలో ఏటూరునాగారం జడ్పీహెచ్ఎస్‌తో పాటు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గర్ల్స్ జడ్పీహెచ్ఎస్, తొర్రూరు జడ్పీహెచ్ఎస్, దంతాలపల్లి జడ్పీహెచ్ఎస్‌తో పాటు గూడూరు మండలం పొనుగోడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏఆర్, వీఆర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

నకిలీ పాస్‌పుస్తకాల ముఠా గుట్టురట్టు

- ముగ్గురు నిందితుల అరెస్టు
- 23 నకిలీ పాస్‌పుస్తకాలు.. ల్యాప్‌టాప్, కంప్యూటర్ స్వాధీనం


కురవి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

కురవి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కొంతమంది రైతులను మభ్యపెట్టి మీకు ఎక్కువ లోన్ ఇప్పిస్తామంటూ ఒక్కో పాస్‌బుక్‌కు రూ.10వేలు వసూలు చేస్తున్న ముఠా గుట్టును రట్టు చేశారు మహబూబాబాద్ జిల్లా కురవి పోలీసులు. ఈ ముఠా అరెస్టుకు సంబంధించి మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు కురవి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. కురవి మండలం మంచ్యాతండాకు చెందిన మూడ్ బాలాజీ, మహబూబాబాద్ మండలం అమనగల్ కస్నాతండాకు చెందిన బానోత్ హరికిషన్, జఫర్‌ఘడ్ మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన బానోత్ వర్ధన్‌లు కలిసి ఒక ముఠాగా ఏర్పడి నకిలీ పాస్‌పుస్తకాలు, నకిలీ 1బీ, ఈసీలు తయారు చేస్తున్నారు. ఇలా కురవి యూనియన్ బ్యాంకు ద్వారా ఒకరికి, డోర్నకల్ యూనియన్ బ్యాంకు ద్వారా ఆరుగురికి, మహబూబాబాద్ యూనియన్ బ్యాంకు ద్వారా ఒకరికి, మహబూబాబాద్ కెనరా బ్యాంకులో ముగ్గురికి మొత్తంగా రూ.16.90 లక్షల విలువ గల రుణాలను నకిలీ పాస్‌పుస్తకాలతో ఇప్పించారు. మరో రూ.కోటి వరకు రుణాలు ఇప్పించేందుకు ముఠా ప్రణాళిక రూపొందించగా కచ్చితమైన సమాచారం మేరకు ఎస్సై గండ్రాతి సతీష్ వారిని వలపన్ని పట్టుకున్నారు. వారి నుంచి 23 నకిలీ పుస్తకాలు, ల్యాప్‌టాప్, రెండు ప్రింటర్లు, ఒక కంప్యూటర్, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

అంతా సన్నాలమయం

- సన్న వడ్లకు సై.. దొడ్డు వడ్లకు నై.. అంటున్న అన్నదాతలు
- భూపాలపల్లి జిల్లాలో 90 శాతానికి పైగా సన్నరకాల వరి సాగు
- బోనస్‌తోపాటు రేషన్‌లో సన్నబియ్యం ఇవ్వడంతో పెరిగిన విస్తీర్ణం
- ఈ వానాకాలం సీజన్‌లో 1.12 లక్షల ఎకరాల్లో వేయనున్న వరి


నారు తీస్తున్న కూలీలు

కాటారం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : అంతా రామమయం.. అన్న సినిమా పాటలాగా ఈ వానాకాలం సీజన్‌లో అంతా 'సన్నాల'మయమే.. అంటూ అన్నదాతలు సన్న రకాల వరి సాగుకు సై అంటూ.. దొడ్డు వడ్లు నై.. అంటున్నారు. భూపాలపల్లి జిల్లాలో గతంలో ఎన్నడూలేని విధంగా సన్నవడ్ల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ వానాకాలం సీజన్‌లో దాదాపు 1.12లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు కానుండగా, సుమారు 1లక్షకు పైగా ఎకరాల్లో సన్నాలే సాగు కానుండటం విశేషం. కాటారం మండలంలో 12,500 ఎకరాల్లో వరి సాగు కానుండగా ఇందులో సుమారు 11వేలకు పైగా ఎకరాల్లో సన్న రకాలే సాగు కానుంది. గతానికి భిన్నంగా రైతులు వరి సాగులో దొడ్డు రకాల వైపు విముఖత చూపుతూ వ్యయప్రయాసల కోర్చి సన్న రకాలకే మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు భరోసాలో భాగంగా సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తోంది. ఈ వానా కాలం సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లకు సైతం బోనస్ వర్తించనుండటంతో సన్న రకాల సాగు విస్తీర్ణం పెరిగింది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో రైతులు సన్నాలకే సై అంటున్నారు.


మొలకెత్తిన వడ్లను చల్లుతున్న రైతు

జిల్లాలో 40 వెరైటీలకు పైగా సన్న రకాలు సాగవుతుండగా ప్రధానంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రకాలైన ఎంటీయూ-1064, 1224, 1271, 1282, 1262, జేజీఎల్-1798, హెచ్ఎంటీ సోనా, కేఎన్ఎం-1638, బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048(తెలంగాణ సోనా), డబ్ల్యూజీఎల్-962, డబ్ల్యూజీఎల్-44లతోపాటు ప్రైవేట్ విత్తన కంపెనీలకు చెందిన జైశ్రీరాం, కావేరి చింటూ, ప్రైజ్, టిల్లూ, జీనెక్స్ చిట్టిపొట్టి, లిల్లీపుట్, ధనిష్ఠ, సూపర్ అమన్, అన్నపూర్ణ, బయోసీడ్-504, పల్లవి, అంకుర్-101, ఆమని, అమోఘ్ తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ఎంటీయూ-1224, 1271, 1282, 1262, ఆర్ఎన్ఆర్-15048(తెలంగాణ సోనా)రకాలకు డిమాండ్ పెరిగి జిల్లా విస్తీర్ణంలో సుమారు 60వేల ఎకరాలకు పైగా సాగు అవుతుండటం విశేషం. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ సన్నబియ్యం వండిపెడుతున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో ఇబ్బడిముబ్బడిగా సన్నరకాల వరి సాగు పెరగడంతో రాష్ట్రంలో సన్నబియ్యం కొరత తీరనుందని ప్రభుత్వం భావిస్తోంది.

చెరువుల కిందనే దొడ్డు వడ్లు సాగు..

ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణంలో సన్న వడ్ల రకాలే 90 శాతానికి పైగా సాగు కానుండగా, కేవలం సుమారు 10వేల ఎకరాల్లోనే దొడ్డు రకం వడ్లు సాగు అవుతున్నట్లు వ్యవసాయాధికారుల అంచనా. బోర్లు, బావుల కింద 98 శాతం సన్న రకం వరి సాగు చేస్తుండగా నాట్లు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ఆయకట్టు విస్తీర్ణం అధికంగా ఉన్న చెరువుల కింద లోతట్టు ప్రాంతాల్లో స్వల్ప, మధ్యకాలిక రకాలైన సన్న వడ్లు సాగు చేస్తే కోతల సమయంలో బురదతో ఇబ్బందిగా మారుతుందని రైతులు కొన్ని చోట్ల దొడ్డు రకం వడ్లు సాగు చేస్తున్నారు. దీంతో చెరువుల కిందనే అక్కడక్కడా ఎంటీయూ-1001, 1061, 1075, కేఎన్ఎం-1153, 1156 వంటి దొడ్డు రకం వడ్లను సాగు చేస్తున్నారు.


నాటు వేస్తున్న కూలీలు

సన్నబియ్యానికి తగ్గిన డిమాండ్

ఈ ఏడాది బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు గతేడాదితో పోలిస్తే తగ్గుముఖం పట్టాయని చెప్పవచ్చు. వడ్లకు రూ.2200 నుంచి రూ.2500 వరకు ధర పలకగా, సన్న రకం పాత బియ్యానికి క్వింటాల్‌కు రూ.4000-5000 వరకు ధర పలుకుతోంది. కొన్ని దొడ్డు రకాల వడ్లకు మార్కెటింగ్‌లో ఇబ్బందులు తలెత్తడం, సన్నరకాల వడ్లు, బియ్యం విక్రయాలకు ఇబ్బంది ఉండదనే ఆలోచనతో రైతాంగం సన్నాల దిక్కు ఆసక్తి చూపిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నా ప్రైవేట్ వ్యాపారులకు అమ్మేయొచ్చని అన్నదాతలు ఆలోచిస్తున్నారు. వడ్లను మిల్లుల్లో పట్టించి బియ్యం సైతం విక్రయించవచ్చని అభిప్రాయంతో ఉన్నారు. బోర్లు, బావుల కింద వరినాట్లు దాదాపు పూర్తి కాగా, చెరువులు, కుంటల కింద నాట్లు ముమ్మరమయ్యాయి. పలువురు రైతులు నాట్లు వేయించడం కాకుండా వెదజల్లే పద్ధతి(బ్రాడ్‌కాస్టింగ్ మెథడ్)లోనూ వరిని సాగు చేస్తున్నారు. కొద్దిగా మొలకెత్తిన వడ్లను పొలంలో చల్లే ప్రక్రియ జరుగుతుంది.

సన్న రకాలకు పెట్టుబడి అధికం..

యాసంగిలో సన్న రకాల సాగు మరీ తక్కువగా ఉంటుండగా, వానా కాలం సీజన్‌లో సాధారణంగా సాగు విస్తీర్ణంలో 40-50 శాతం మధ్య సన్న రకాల వడ్లు సాగవుతాయి. దొడ్డు వడ్ల వెరైటీలతో పోలిస్తే సన్న రకం వరి సాగుకు పెట్టుబడి అధికమవుతుంది. సన్న రకాలకు తెగుళ్లు, చీడపీడల బాధ ఎక్కువగా ఉంటుండగా నివారణ, నియంత్రణ కోసం పురుగు మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. దొడ్డురకం వరి దిగుబడితో పోలిస్తే సన్న రకాలు తక్కువ దిగుబడినిస్తాయి. అయినప్పటికీ సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ వస్తుండడంతో రైతులు సన్నాల సాగు వైపు అడుగేశారు. జిల్లావ్యాప్తంగా, కాటారం సబ్ డివిజన్‌లోనూ సన్న రకాల వడ్ల సాగు అధికంగా ఉందని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి బాపురావు, మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ వెల్లడించారు.



ఆర్టీసీ బస్సు సేవలను వినియోగించుకోవాలి

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి బస్టాండ్‌లో నూతన బస్సును లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ బస్సు భూపాలపల్లి నుంచి మోరంచపల్లి, గోపాల్‌పూర్, కొడవటంచ మీదుగా పరకాలకు వెళుతుందని తెలిపారు. ప్రజల అభ్యర్థన మేరకు ఈ బస్సును ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా అదే బస్సులో కొడవటంచ వరకు ప్రయాణించారు. ఈ బస్సు ఉదయం 6.30గంటలకు భూపాలపల్లి బస్టాండ్ నుంచి బయలుదేరుతుందని, పరకాలకు 8గంటల వరకు చేరుకుం టుందని తెలిపారు. అలాగే తిరుగు ప్రయాణంలో ఉదయం 8.15గంటల కు పరకా లలో బయలుదేరి 10గంటల వరకు భూపాలపల్లికి చేరుకుంటుందని తెలిపారు. అలాగే సాయంత్రం 5.15గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంలో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం ఇందు, మాజీ కౌన్సిలర్లు ముంజాల రవీందర్, కురిమిళ్ల శ్రీనివాస్, దాట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రంజిత్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.





ఆర్టీసీ బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ధ్యాన్‌చంద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

● భూపాలపల్లి కలెక్టరేట్ : ప్రతి మండల కేంద్రంలో క్రీడా మైదానాల ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొని మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ పోరాటం మరువలేనిదని తెలిపారు. ఆయన ఆదర్శనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, యూత్‌అండ్ స్పోర్ట్స్ అధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాటారం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి నియంత్రణ కు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించారు. ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను, వైద్యసేవలందుతున్న తీరును తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సందీప్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ల్యాబ్ టెక్నీషియన్ పుష్ప, సాగర్, ఫార్మసిస్ట్ రైసా తదితరులు ఉన్నారు.

రోడ్డు వెడల్పుకు అధికారుల మార్కింగ్

మొగుళ్లపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లపల్లి గ్రామ శివారు నుంచి టేకుమట్ల మండలం గుమ్మడవెల్లి వరకు రూ.10కోట్లతో డబుల్‌రోడ్డు మంజూరు కాగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో ఆ నిర్మాణ పనులు కొన్నిరోజులనుంచి పర్లపల్లి, పెద్దకోమటిపల్లి గ్రామాల్లో వేగవంతంగా జరుగుతున్నాయి. కాగా, డబుల్‌రోడ్డుకు సమీపంలో ఉన్న ఇళ్లకు రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా 25ఫీట్ల చొప్పున, ఆలోపు ఉన్న ఇళ్లను తొలగించి రోడ్డు వెడల్పు కార్యక్రమానికి అధికారులు శుక్రవారం మార్కింగ్ చేశారు. పర్లపల్లి, పెద్దకోమటిపల్లి పంచాయతీ కార్యదర్శులు నాగలత, ఇంద్రసేన, సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్మాయిల్ సేవలు అభినందనీయం

వెంకటాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయ అటెండర్ ఇస్మాయిల్ అందించిన సేవలు అభినందనీయమని తహసీల్దార్ గిరిబాబు కొనియాడారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఇస్మాయిల్ పదవీవిరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ గిరిబాబు ఇస్మాయిల్ దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, జేడీ మల్లంపల్లి డిప్యూటీ తహసీల్దార్ మమత, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మానేరుకు జలకళ



చెక్‌డ్యాం పై నుంచి సాగుతున్న ప్రవాహం

మల్హర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల మానేరు జలకళను సంతరించుకుంది. మొన్నటి వరకు ఏడారిని తలపించిన మానేరు నేడు ఎటు చూసిన నీరే కనబడుతుంది. రెండు జిల్లాల సరిహద్దు పీవీనగర్ వద్ద మానేరు వల్లెంకుంట శివారులో నిర్మాణం చేపట్టిన చెక్‌డ్యాం పై నుంచి ప్రవాహం సాగుతుంది. చెక్‌డ్యాం వద్ద నుంచి సుమారు కిలో మీటర్ మేర నీరు నిలిచి ఉంది. తాడిచర్ల వద్ద మానేరు ప్రవాహం సాగుతుంది.

మూడురోజులుగా తాగునీటి కోసం తండ్లాట..

కన్నాయిగూడెం , ఆగస్టు 29 (ఆగస్టు): ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండల ప్రజలు గత మూడు రోజులుగా తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. మండలంలోని గ్రామాలకు ఏటూరునాగారం మండలం లోని రొయ్యూరు వద్ద ఉన్న గ్రిడ్ నుంచి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండా తాగునీటిని మండలానికి నిలిపి వేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రాత్రి నుండి నేటి వరకు తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయ మై గ్రిడ్ డీఈఈ సుమన్ న్ ఫోన్ లో సంప్రదించగా గోదావరి ఫ్లోటింగ్ ఎక్కువ ఉన్నందున సిల్టు వస్తుందని అందుకే నీటి సరఫరాను నిలిపి వేశామన్నారు. వరద ప్రవాహం తగ్గిన తర్వాత సరఫరా చేస్తామన్నారు. ఎంపీడీఓలకు సమాచారం ఇచ్చామని వారు గ్రామాల్లో చెప్పించకపోతే తమది బాధ్యత కాదని తెలుపడం గమనార్హం.

నానో యూరియాతో పలు ప్రయోజనాలు

కాటారం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):నానో యూరియా, నానో డీఏపీ వాడకంతో పలు ప్రయోజనాలు కల్గుతాయని వ్యవసాయశాఖ మహదేవపూర్ డివిజన్ సహాయ సంచాలకుడు శ్రీపాల్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం పీఏసీఎస్ గోదాం, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో ఏవో పూర్ణిమతో కలిసి ఏడీఏ తనిఖీలు నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేసి యూరియా, ఇతర ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా నానో యూరియా, డీఏపీల వాడకంతో కల్గే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు.

డీపీఎంవో సత్యనారాయణకు సన్మానం

వెంకటాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31న పదవీవిరమణ చేయనున్న డీపీఎంవో సత్యనారాయణకు శుక్రవారం ఘన సన్మానం జరిగింది. మండలంలోని ఎదిర వైద్యశాల ఆవరణలో శుక్రవారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్ అధ్యక్షతన కార్యక్రమం జరగగా డీఎంహెచ్‌వో గోపాల్‌రావు సత్యనారాయణ దంపతులను శాలువాతో సన్మానించారు. క్షయ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్, మలేరియా అధికారి దుర్గారావు, సాంబయ్య పాల్గొన్నారు.



సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో

అర్హతకు మించి వైద్యం చేయొద్దు

వాజేడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆర్‌ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయొద్దు అని డీఎంహెచ్‌వో డాక్టరు గోపాలరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు ఆర్‌ఎంపీ క్లీనిక్‌లను ఆయన అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంపీలు క్లీనిక్‌లలో పరిమితికి మించి వైద్యం చేస్తున్నట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిమితికి మించి వైద్యం చేస్తే తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. డీఎంహెచ్‌వో వెంట వాజేడు వైద్యాధికారులు డాక్టరు మహేందర్, మధుకర్, తదితరులు ఉన్నారు.

గుంతలను పూడ్చివేయించిన ఎస్సై

వెంకటాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్ష ణ లో భాగంగా నిత్యం బిజీగా ఉండే వెంకటాపూర్ పోలీసులు ప్రజా సేవలో ముం దుకెళ్తున్నారు. వర్షాలకు దెబ్బ తిన్న రోడ్లకు స్థానిక ఎస్సై చల్ల రాజు ఆధ్వర్యంలో పోలీసులు రహదారికి మరమ్మతులు చేపట్టారు. మండలంలోని లక్ష్మీదేవిపేట- బూరుపేట గ్రామాల మధ్య గల ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో నారాయణపూర్ ట్రాక్టర్ యూనియన్ అసోసియేషన్ సహకారంతో శుక్రవారం ఎస్సై సిబ్బందితో కలిసి రహ దారులపై ట్రాక్టర్ల ద్వారా మొరం పోయించి మరమ్మతులు చేయించారు.



రోడ్డును చదును చేయిస్తున్న ఎస్సై రాజు

వరద బాధితులకు సరుకులు అందజేత

మంగపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన బాధితులకు హైదరాబాద్‌కు చెందిన రియలేబుల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తమ వంతుగా నిత్యావసర సరుకులు, ఇతర 15 రకాల విలువైన పరికరాలను అందజేశారు. శుక్రవారం రాత్రి మండ లంలోని కమలాపురం గ్రామ పంచాయతీ ఆవరణంలో బాధితులకు ములుగు అడిషనల్ (రెవెన్యూ) జిల్లా కలెక్టర్ మహేందర్‌జీ, ములుగు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ చేతుల మీదుగా సంస్థ చైర్మన్ తుపాకుల రవి పంపిణీ చేశారు. కమలాపురానికి చెందిన 63 మంది, మంగపేటకు చెందిన 60 మందికి, నర్సింహసాగర్‌కు చెందిన ఆరుగురికి అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీవో బాత్ రవిచందర్, ఎంపీవో పొదిల శ్రీనివాస్, మంగపేట మాజీ జడ్పీటీసీ గుమ్మడి సోమయ్య పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్, సంస్థ ప్రతినిధులు

జాతీయ క్రీడా, భాషా దినోత్సవ వేడుకలు



దామెరకుంట జడ్పీహెచ్‌ఎస్‌లో క్రీడా దుస్తులతో విద్యార్థులు

కాటారం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):మండలంలో జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తన అద్భుతమైన ఆట తీరుతో కోట్లాది మంది దేశ ప్రజల మనసును గెలుచుకున్న హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే క్రీడా దినోత్సవాన్ని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, గురుకులాల్లో ఘనంగా నిర్వహించారు. దామెరకుంట జడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు సొంత ఖర్చులతో అందించారు. కాటారం జడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ పంతకాని సమ్మయ్య ఆధ్వర్యంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కస్తూర్బా విద్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు తెలుగు పాటలు, పద్యాలు, కవితలతో అలరించారు. మేజర్ ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు నాగలక్ష్మి, రాజేందర్, గట్టయ్య, వెంకటరమణ, శ్రీనివాస్, రాధ రవీందర్, శ్రీధరాచార్యులు, విజయేందర్, కుమార్, సాజిదాబేగం, సునీత, కరుణాకర్‌రావు, బండి శ్రీనివాస్, ఆత్మకూరి కుమార్, చంద్రయ్య, రాజేంద్రప్రసాద్, సంపత్ పాల్గొన్నారు.

'బండి' జోరుకు బ్రేకులు

(5వ పేజీ తరువాయి)

ఎస్టేట్ వెంచర్‌లు, పౌల్ట్రీ ఫామ్‌లు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రైడ్స్ ప్రారంభించారు. హనుమకొండ చైతన్యపురిలోని ఆయన నివాసం, ఖమ్మంలోని బంధువుల ఇళ్లు, ఖిలా వరంగల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఏకకాలంలో అధికారులు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో నాగేశ్వరరావు ఆస్తుల చిట్టా వెలుగులోకి వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. హనుమకొండ చైతన్యపురిలోని నాగేశ్వర్‌రావు సొంత ఇంటిలో సోదాలు చేయగా అనేక ఆస్తులు బయటపడ్డాయి. రూ. కోటి 15 లక్షల విలువ చేసే ఇల్లు, రూ.కోటి 43 లక్షల విలువ చేసే 17ఎకరాల 10 గుంటల వ్యవసాయభూమి, రూ.23 లక్షల 88 వేల విలువైన 70 తులాల బంగారు ఆభరణాలు, రూ.92 వేల విలువైన వెండి ఆభరణాలు, రూ.37లక్షల 78వేల విలువైన రెండు ఫోర్ వీలర్లు, ఒక ద్విచక్ర వాహనం, రూ.3లక్షల 28 వేల విలువైన 23 గడియారాలు, రూ.16లక్షల 44 విలువైన గృహోపకరణాలు గుర్తించినట్లు డీఎస్పీ వెల్లడించారు. వీటి మొత్తం విలువ రూ.5కోట్ల పైనే ఉంటుందని తెలిపారు. అయితే మార్కెట్ విలువ ఇంత కన్నా అధికంగా ఉంటుందన్నారు. నిందితుడు నాగేశ్వర్‌రావుపై అక్రమ ఆస్తుల కేసులు నమోదుచేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

వాజేడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు విమర్శించారు. శుక్రవారం మండలంలో నెలకొన్న పలు సమస్యలను బీజేపీ మండల అధ్యక్షుడు పెద్ది జగపతి ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కందుల రామ్‌కిషోర్, సాగి సీతారామరాజు, ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి ప్రవీణ్, పీఏసీఎస్ డైరెక్టర్ కుర్సం కృష్ణమూర్తి, బీజేవైఎం మండల అధ్యక్షుడు సంద్ర సోమరాజు, నాయకులు యాలం సుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

మద్యం షాపులను స్థానిక ఆదివాసీలకే ఇవ్వాలి

మంగపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ఎ- 4 మద్యం(వైన్‌షాపు)లు నిర్వహించాలని మండలంలోని గ్రామాలలో పెసా గ్రామసభలలో వైన్‌షాపులు కావాలని పెసా గ్రామసభ ఆమోదం తెలిపిందని ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలో జిల్లా అడిషనల్(రెవెన్యూ) కలెక్టర్ మహేందర్‌జీని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగిందని ఆదివాసీ సంఘాల నాయకులు తాటి విజయ్, మారబోయిన గోవర్ధన్‌లు సాయంత్రం మంగపేటలో విలేకరులకు తెలియజేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఏటూరు నాగారం ఐటీడీఏ పీ.వోకు, మంగపేట తహసీల్దార్, ఎంపీడీవోలను కలిసి వినతి పత్రాలు అందజేసినట్లు విజయ్, గోవర్ధన్‌లు వివరించారు.

సెప్టెంబరు 1ని విద్రోహ దినంగా జరపాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా జరపాలని, ఈ మేరకు కలెక్టరేట్‌ను ముట్టడించాలని టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు శుక్రవారం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమవుతున్నాయని అన్నారు. సెప్టెంబరు 1న తలపెట్టిన కలెక్టరేట్‌ల ముట్టడి కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెండెం మధుసూదన్, గెజిటెడ్ హెచ్‌ఎం మండల రవీందర్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బానోతు సేవానాయక్ పాల్గొన్నారు.

మార్కెట్ షెడ్‌లను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

గణపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వారాంతపు సంత మా ఊరు సంత పేరుతో నిర్మించిన మార్కెట్‌ను ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జేసీబీలతో కూల్చివేతలు చేపట్టిన మార్కెట్ షెడ్డులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అంగడి నిర్వహించే ప్రాంతంలో గతప్రభుత్వం రేకులషెడ్లు, మరుగుదొడ్లు నిర్మిస్తే, ఈ ప్రభుత్వంలో ప్రజలకు సంబంధించిన ఆస్తిని ఎటువంటి ముందస్తు నోటీసులు, పర్మిషన్ లేకుండా కూల్చివేతలు చేపట్టడం సరైన పద్ధతి కాదని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోతె కర్ణాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, రవీందర్, రాజిరెడ్డి, చింటూ, రఘు, యాకయ్య ఉన్నారు.



మార్కెట్ షెడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

నేడు చిన్నకాళేశ్వరం భూ సేకరణపై గ్రామసభ

కాటారం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని జాదరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేపట్టే భూసేకరణ కోసం శనివారం ఉదయం 10గంటలకు గ్రామసభ నిర్వహించ నున్నట్లు తహసీల్దార్ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గూడూరు పెద్ద చెరువు కట్ట విస్తరణకు సంబంధించిన 3 ఎకరాల 23 గుంటల కోసం గ్రామ సభను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే గ్రామ సభకు భూములు కోల్పోతున్న రైతులు హాజరై తమ అభిప్రాయాలను తెలుపాలని పేర్కొన్నారు.

జ్ఞానం వైపు నడిపించడమే స్వేరోస్ లక్ష్యం

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానం వైపు నడిపించడమే స్వేరోస్ లక్ష్యమని స్వేరో కోర్ రాష్ట్ర చీఫ్ బాబునాయక్ అన్నారు. శుక్రవారం భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన స్వేరోస్ జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆశయ సాధన కోసం ప్రతీ యువకుడు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కోకన్వీనర్ గుర్రం నాగరాజు, నాయకుడు తిక్క వినోద్, గుర్రం రఘుపతి, విద్యాసాగర్, జశ్వంత్, సన్నీ, గణేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడుస్తూ బీజేపీ నాయకుల ప్రదర్శన

గణపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లపై ఉన్న గుంతలను పూడుస్తూ బీజేపీ నాయకులు ప్రత్యేక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని నగరంపల్లి, అప్పయ్యపల్లి గ్రామాల మధ్య ఉన్న రోడ్లు వర్షాలతో పూర్తి స్థాయిలో దెబ్బతినగా విషయం తెలుసుకున్న మండల బీజేపీ అధ్యక్షుడు ఊర నవీన్‌రావు తన కార్యకర్తలతో కలిసి రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు వారిపై ప్రశంసలు కురిపించారు. బీజేపీ నాయకులు చెలుమల్ల ప్రవీణ్, హరిలాల్, మొగిలి, మల్లయ్య, రాజేందర్, శంకర్ తదితరులు ఉన్నారు.

నేడు ఓటర్ల జాబితాలపై సమీక్షా సమావేశం

కాటారం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11గంటలకు గ్రామపంచాయతీల ఓటర్ల జాబితాల డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అడ్డూరి బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా జీపీలకు సంబంధించిన వార్డుల వారీగా రూపొందించిన ఓటర్ల జాబితాలపై అభ్యంతరాల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల మండల ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో ఆ ప్రకటనలో కోరారు.

సబ్సిడీ యంత్రాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఎస్టీ మహిళ, చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీపై యంత్రాలు అందించడం జరుగుతుందని అన్నారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతులకు 50శాతం సబ్సిడీ, పెద్ద రైతులకు 40శాతం సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. బ్యాటరీ పంపులు, పవర్ స్ప్రేయర్లు, రోటవేటర్, కల్టివేటర్, బ్రష్‌కట్టర్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు.కావాల్సిన రైతులు దరఖాస్తు ఫారంతోపాటు పట్టాదారు పాస్‌పుస్తకం, ట్రాక్టర్ ఆర్‌సీ జతచేయాలని సూచించారు. మండలంలోని రైతుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్షాకాల వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

ఏటూరునాగారం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాకాల వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని రొయ్యూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని డాక్టర్ సుమలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నందమూరినగర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య అధికారిని సుమలత ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం సమ్మక్క, ఆశా కార్యకర్త సునీత, గీత, సుగుణవతి, సరిత పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేష్



రమేష్

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన నగరపు రమేష్ నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం రమేష్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

సెప్టెంబరు 22 నుంచి ఓపెన్ పరీక్షలు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 22 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని డీఈవో రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో (ఓపెన్ స్కూల్ సొసైటీ) భూపాలపల్లి జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల భూపాలపల్లిలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సెప్టెంబరు 22 నుంచి 28వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు థియరీ పరీక్షలు ఉంటాయని, అలాగే ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబరు 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు.

సెంట్రల్ డివైడర్ పైకి దూసుకెళ్లిన బొగ్గు టిప్పర్

కాటారం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రం శివారులో నిర్మాణంలో ఉన్న కాటారం-మంథని ఫోర్‌లేన్ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున బొగ్గు టిప్పర్ అదుపుతప్పి సెంట్రల్ డివైడర్‌పైకి దూసుకెళ్లింది. భూపాలపల్లి నుంచి గోదావరిఖనికి వరంగల్ నుంచి బొగ్గు లోడ్‌తో వెళ్తుండగా డివైడర్‌పైకి దూసుకెళ్లి మధ్యలో ఆగిపోయింది. గతంలోనూ ఇదే చోట మట్టి లారీ డివైడర్ పైకి దూసుకెళ్లడంతో 20మీటర్లకు పైగా డివైడర్‌తో పాటు లారీ అడుగు భాగం ధ్వంసమైంది. కాగా ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పోర్ట్స్ డే

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ స్పోర్ట్స్ డే, ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు క్రీడలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. మేరా యువభారత్ సంఘం ఆధ్వర్యంలో జరుగగా వలంటీర్లు సురేష్, భిక్షపతి, అధ్యాపకులు రామ్‌చందర్, కుమారస్వామి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలో సీట్లు కేటాయించాలి

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో 20శాతం సీట్లు యువజన కాంగ్రెస్ నాయకులకే కేటాయించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు సురేష్, రజినికాంత్, సాయిచరణ్, తోట రంజిత్, కోటేశ్వర్‌రావు, ప్రేమ్‌కుమార్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.